## క్లుప్తంగా

### వెంకటగిరి ఏపీఓగా దీప

**వెంకటగిరిరూరల్:** వెంకటగిరి రూరల్ మండలం ఏపీఓగా దీప గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో వెంకటగిరిలో పనిచేస్తున్న ఇన్‌చార్జ్ ఏపీఓను రెగ్యులర్ చేయడంతో వరదయ్యపాళెం ఏపీఓగా పనిచేస్తున్న దీప వెంకటగిరి ఏపీఓగా బదిలీపై వచ్చారు. ఈ మేరకు గురువారం ఆమె స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

### కారు బోల్తా పడి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన చిరంజీవి

**చిల్లకూరు:** మండలంలోని కడివేడు సమీపంలో కారు బోల్తా పడి ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గురువారం పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం మొలకలపూడికి చెందిన యువకులు చిరంజీవి, శ్యాం, రమాకాంత్ హార్వెస్టు పనులు చేస్తున్నారు. వీరు కారులో కోటలో పని చూసుకుని ఇంటికి కారులో వెళ్తుండగా కడివేడు వద్దకు వచ్చే సరికే ముందు టైర్ పంక్చర్ అయింది. దీంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పక్కనే ఉన్న పొలాల్లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో చిరంజీవి తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది గాయపడిన వ్యక్తిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### కనుల పండువగా కల్యాణోత్సవం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

**నాయుడుపేటటౌన్:** పట్టణంలోని పిచ్చిరెడ్డి తోపు వీధిలో ఉన్న శ్రీవిజయ గణపతి ఆలయ బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు గురువారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద స్వామివారికి అభిషేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణం వద్ద అన్నదానం చేపట్టారు. రాత్రి విజయ గణపతి స్వామివార్ల ఉత్సవమూర్తి నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మహారాజ పోషక ఆలయ కమిటీ అధ్యక్షుడు బైనా మల్లికార్జున రెడ్డి, ప్రళయ కావేరి ఉదయశంకర్, సానాపుత్తూరు రవి, ఆలయ కమిటీ సభ్యులు, విజయ గణపతి అనుగ్రహ సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

### క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**కోట:** పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజారిటీలో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. గోవిందపల్లిలో పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డికి మద్దతుగా గురువారం జెడ్పీటీసీ మాజీ సభ్యులు ఉప్పల ప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపాలయ్య, నాయకులు వెంకటాద్రి, రామయ్య, రంగయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### మద్యం విక్రేతల అరెస్ట్

**నాయుడుపేటటౌన్:** అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసి, నిందితులను అరెస్ట్ చేసినట్లు స్థానిక సెబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక సెబ్ కార్యాలయంలో నిందితులను హాజరు పరచి వివరాలను తెలిపారు. పెళ్లకూరు మండలం చెంబెడు గ్రామంలో అదే గ్రామానికి చెందిన మీరాగయ్య, రాజుపాళెం గ్రామంలో తులసిరామ్ ప్రసాద్ అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో గురువారం దాడులు చేసి పట్టుకున్నట్లు చెప్పారు. ఇద్దరి వద్ద నుంచి 73 మద్యం బాటిళ్లను పట్టుకుని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో సెబ్‌సిబ్బంది పాల్గొన్నారు.

### వైఎస్సార్ బీమా అందజేత

**సూళ్లూరుపేట రూరల్:** మండలంలోని ఉగ్గుముడి పంచాయతీకి చెందిన వెలుగు కృష్ణయ్య గుండెపోటుతో మృతి చెందడంతో అతని భార్య వెలుగు మునెమ్మకు వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ.10 వేలును సహాయంగా అందించామని ఎంపీడీఓ ప్రమీళా రాణి తెలిపారు. ఎంపీడీఓ చేతుల మీదుగా గ్రామపెద్దల సమక్షంలో ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఎంఎస్పీ అధ్యక్షుడు విశ్వనాథ్‌కు అభినందన

**వెంకటగిరి:** మహజన సోషలిస్ట్ పార్టీ ఏపీ అధ్యక్షుడిగా డాక్టర్ వైకే విశ్వనాథ్ మాదిగ ఎంపిక కావడం అభినందనీయమని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ శ్రీనివాసమాదిగ తెలిపారు. గురువారం వెంకటగిరిలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో 30 ఏళ్ల క్రియాశీలకంగా వ్యవహరించిన విశ్వనాథ్ మాదిగ ఈనెల 30వ తేదీన నెల్లూరు రానున్నారని తెలిపారు.

# యోధుల ప్రాణత్యాగమే స్వాతంత్య్రం

- ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు అందాలి
- ఆ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రజలు ఆర్థికవృద్ధిలోకి రావాలి
- గణతంత్ర వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు
- వాడవాడలా రెపరెపలాడిన మువ్వన్నెల జెండా



గూడూరు: జెండా ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్, ఎమ్మెల్యే వరప్రసాద్, వాకాడులో జెండా ఎగురవేస్తున్న ఏఎంసీ చైర్మన్ నాగభూషణమ్మ

**గూడూరు:** ఎందరో త్యాగధనుల ప్రాణత్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్య్రం అని ఆర్డీఓ కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గణతంత్ర వేడుకలను ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తదితరులతో కలసి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతోమంది యోధులు ప్రాణాలను ఫణంగా పెట్టి మనకు స్వాతంత్య్రాన్ని తీసుకొస్తే, బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా బడుగు బలహీన వర్గాలకు హక్కులు కల్పించారన్నారు. అభినవ అంబేడ్కర్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రభుత్వాలు అర్హత ఉన్న వారందరికీ ప్రజాసంక్షేమ పథకాలను అందజేస్తున్నాయని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి, సంస్థలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. అలాగే డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సాయినాథ్, రవాణా శాఖ కార్యాలయంలో ఆర్టీఓ రవీంద్రనాథ్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లీలారాణి, 24 సొసైటీ కార్యాలయంలో అధ్యక్షుడు అట్ల శ్రీనివాసులు రెడ్డి, అన్ని పోలీస్ స్టేషన్లలో, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, పోలీస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**పలు మండలాల్లో..**

**చిల్లకూరు/చిట్టమూరు/వాకాడు/ కోట:** ఆయా మండలకేంద్రాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. చిల్లకూరులో ఎంపీపీ తుపాకుల వెంకటరమణమ్మ, జెడ్పీటీసీ మన్నెం శీనయ్యతో కలసి ఎంపీడీఓ విష్ణుచిరంజీవి జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే చిట్టమూరు, మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. అలాగే కోట మండలంలో జరిగిన వేడుకల్లో ఎంపీపీ దాసరి అంజమ్మ, జెడ్పీటీసీ కోటయ్య, వాకాడు ఏఎంసీ కార్యాలయంలో చైర్మన్ నాగభూషణమ్మ, అలాగే సొసైటీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, పాల్గొన్నారు. బుర్లవారిపాళెం పాఠశాల విద్యార్థులు దేశ నాయకుల వేషధారణలో అలరించారు.


వెంకటగిరి : జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న కమాండెంట్ ఎల్ఎస్ పాత్రుడు

**మహనీయుల త్యాగఫలం**

**వెంకటగిరిరూరల్:** ఎందరో మహనీయుల త్యాగఫలమే గణతంత్రం అని ఎంపీపీ తంబిరెడ్డి తనూజా రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీపీ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయజెండాను ఎగురవేసి ఆమె వందనం సమర్పించారు. అలాగే మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు, కార్యాలయాల్లో జాతీయజెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. 9వ బెటాలియన్‌లో కమాండెంట్ ప్రకాష్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా బెటాలియన్ పోలీసు కవాతు నిర్వహించారు. అనంతరం కమాండెంట్ ప్రకాష్ అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఎగుర వేసి వందనం సమర్పించారు. కార్యక్రమంలో బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

**బాలాయపల్లి, రాపూరు మండలాలలో..**

**వెంకటగిరిరూరల్(బాలాయపల్లి):** బాలాయపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయజెండా ఎగురవేశారు. మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, స్కూళ్లల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. రాపూరు మండలవ్యాప్తంగా గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ, కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ ఆమోస్‌బాబు, తహసీల్దార్ శ్యాంసుందర్‌రాజు మువ్వెల జెండాను ఎగురవేశారు.


నాయుడుపేట టౌన్ : క్రీడా దుస్తులు, క్రీడా పరికరాలను పంపిణీ చేస్తున్న సుబ్రహ్మణ్యం రెడ్డి

**పలు మండలాల్లో..**

**సైదాపురం/కలువాయి/డక్కిలి:** మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మి జాతీయ జెండా ఎగురవేసి వందనం సమర్పించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పెంచలమ్మ, జెడ్పీటీసీ పోలయ్య, సొసైటీ కార్యాలయంలో అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు జెండా ఎగరవేశారు. అలాగే కలువాయి జెడ్పీటీసీ సభ్యులు బి.అనిల్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ ఆర్.లక్ష్మీదేవిలు ముఖ్య అతిథులుగా గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు. జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన కలువాయి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని లక్ష్మీసాహితిని ఘనంగా సన్మానించారు. అలాగే డక్కిలి మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి, ఎంపీపీ గోను రాజశేఖర్,

**మువ్వన్నెల రెపరెపలు**

**సూళ్లూరుపేట రూరల్ :** నియోజకవర్గవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. వాడవాడలా మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. అలాగే విధి నిర్వహణలో మంచి పనితీరు కనబరుస్తున్న వివిధ శాఖల అధికారులకు, సచివాలయ సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. సూళ్లూరుపేట పట్టణంలోని అక్బరియా మసీదు వద్ద దారుల్ ఉలుమ్ యూసిఫియా మదర్సాలో తిరుపతి జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ సిరాజ్‌బాషాతో పాటు మున్సిపాలిటీ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, శ్రీహరికోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షార్ డిప్యూటీ డైరెక్టర్ సెంథిల్ కుమార్ జెండా ఎగురు వేశారు.


కలువాయి : మండల పరిషత్ కార్యాలయంలో..

**నాయుడుపేట టౌన్‌లో..**

**నాయుడుపేటటౌన్:** పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలతో పాటు పలు పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు గణతంత్ర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి కౌన్సిలర్లు జాతీయ జెండాను ఎగురవేశారు. డీఎస్పీ కార్యాలయం వద్ద డీఎస్పీరాజగోపాల్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పుదూరు బాలికల గురుకుల స్కూల్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొని అక్కడి విద్యార్థులకు క్రీడా పరికరాలు, రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన 25 మందికి పైగా విద్యార్థినులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. విద్యార్థినుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.


గూడూరు: దర్గాలో జెండా ఆవిష్కరిస్తున్న ముస్లింలు


గూడూరు: దేశభక్తిని కాంక్షిస్తూ విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు

**పలు మండలాల్లో..**

**నాయుడుపేట/ఓజిలి/తడ/దొరవారిసత్రం/పెళ్లకూరు:** ఆయా మండలకేంద్రాల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. ఓజిలి ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి పాల్గొన్నారు. ఓజిలి ఉన్నత పాఠశాలలో పాస్టర్ మనోహరం జాపకార్థం పాఠశాల పూర్వపు విద్యార్థి ఫ్రాంక్లిన్ 250 మంది విద్యార్థులకు అన్నదానం చేశారు. నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ మధుసూదన శర్మ జరిగిన గణతంత్ర వేడుకల సందర్భంగా ఎన్‌సీసీ కాలేజీ కమాండర్ శివారెడ్డి, డాక్టర్ కిరణకుమార్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

**మున్సిపల్ కార్యాలయంలో..**

**వెంకటగిరి:** మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటరామయ్య జాతీయజెండాను ఆవిష్కరించారు. 5వ వార్డు సచివాలయంలో జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ మాట్లాడారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు బాలయ్య, ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.






మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, తడ పోలీస్ స్టేషన్‌లో.., నాయుడుపేట టౌన్ : విన్యాసాలు చేస్తున్న గురుకుల స్కూల్ విద్యార్థినులు, నాయుడుపేట: మున్సిపల్ కార్యాలయంలో.., వాకాడు: దేశ నాయకుల వేషధారణలో బుర్లవారిపాళెం విద్యార్థులు

# గగన్‌యాన్ ప్రాజెక్టు సిద్ధం చేస్తున్నాం



జెండాను ఎగురవేస్తున్న షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, వందనం సమర్పిస్తున్న సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది

- షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ వెల్లడి

**సూళ్లూరుపేట:** భారతదేశంలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్న గగన్‌యాన్ ప్రాజెక్టుకు సంబంధించిన పనుల్లో ఇస్రో శాస్త్రవేత్తలు, ఇతర ఇంజినీర్లు, సిబ్బంది నిమగ్నమై ఉన్నామని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. గురువారం షార్‌లోని స్పేస్ సెంట్రల్ స్కూల్ మైదానంలో గణతంత్ర వేడుకలను చాలా నిరాడంబరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ రాజరాజన్ మువ్వన్నెల జెండాను ఎగురవేసి సెల్యూట్ చేశారు. అనంతరం కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలు సైనిక వందనాన్ని సమర్పించారు. ముందుగా ఇస్రో కుటుంబానికి, దేశ ప్రజలకు రిపబ్లిక్‌డే శుభాకాంక్షలను తెలియజేశారు. స్పేస్ సెంట్రల్ స్కూల్ ఉపాధ్యాయులను, అగ్రశ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గగన్‌యాన్ ప్రాజెక్టుతో పాటుగా చంద్రయాన్-3 ప్రయోగానికి సంబంధించి కూడా అనేక ప్రయోగాత్మక పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. షార్ కేంద్రంలోని సిబ్బంది అంతా వివిధ రకాల పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తూ ఘన ఇంధన మోటార్లు ఉత్పత్తి, ప్రయోగ పరీక్షలను చేస్తున్నామని చెప్పారు. కమ్యూనిటీ, కనెక్టివిటీ అనే నినాదంతో ఇస్రో పనిచేస్తోందని చెప్పారు. ఈ దేశంలో సామాన్యులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, దేశ సరిహద్దుల్లో సెక్యూరిటీకి కూడా విలువైన సమాచారాన్ని అందజేస్తుండడం గర్వంగా ఉందన్నారు. ఎల్‌వీఎం03ఎం2 ప్రయోగం ద్వారా వన్‌వెబ్ కంపెనీకి చెందిన 36 ప్రైవేట్ ఉపగ్రహాలను పంపించి వాణిజ్యపరంగా మరో అడుగు ముందుకు పడిందని చెప్పారు.


# సమన్వయంతో పనిచేసి పార్టీని గెలిపిద్దాం


కలువాయి: పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

**వెంకటగిరి:** వచ్చే ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురేద్దామని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలియజేశారు. నియోజకవర్గంలోని కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో మండలం నుంచి 50 పైగా వాహనాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివచ్చి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. అనంతరం నేదురుమల్లి మాట్లాడుతూ కలువాయి మండల వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఉత్సాహం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో కలువాయి ఎంపీపీ లక్ష్మీదేవి, మండల ఉపాధ్యక్షుడు పెంచల నరసారెడ్డి, దుంపా రమాదేవి, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, ప్రముఖవైద్యుడు రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నేతలు శంకరరెడ్డి, సురేష్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు, సొసైటీ అధ్యక్షుడు దశరథరామిరెడ్డి, నాగయ్య, శ్రీనివాసులురెడ్డి, కార్తీక్‌రెడ్డి, వేణునాయుడు, మాజీ ఎంపీపీ కడప బ్రహ్మయ్య, నాయకులు గణేష్‌రెడ్డి, రమేష్ రెడ్డి, కౌన్సిలర్ వహీదా, కృష్ణమూర్తి, సీపీఎల్ నరసింహరావు, లక్ష్మీనారాయణరెడ్డి, సైదాపురం మాజీ ఎంపీపీ మన్నారపు రవి, సంపూర్ణ పాల్గొన్నారు.

**నేదురుమల్లిని కలిసిన కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి..**


నేదురుమల్లికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నేతలు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి గురువారం స్థానిక నేదురుమల్లి నివాసంలో జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఇరువురు పలు అంశాలపై చర్చించారు.

### భోజనం ప్యాకెట్ల అందజేత

**దొరవారిసత్రం:** నెలబల్లి గ్రామలోని ఎస్టీ కాలనీకి చెందిన చిన్నారులకు తడ కండ్రిగకు చెందిన శ్రీకృష్ణా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోజనం ప్యాకెట్లు అందజేశారు. నెల్లూరు జిల్లా కలువాయి ప్రాంతానికి చెందిన చిన్నికృష్ణ, వందనగీతల సహకారంతో అన్నదానం కార్యక్రమం చేపట్టినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. సభ్యులు కేశవులు, చిన్నమ్మ పాల్గొన్నారు.

### విస్తృతంగా ప్రచారం

**ఓజిలి:** మండల పరిధిలోని రాచపాళెం, ఓజిలి గ్రామాల్లో గురువారం తూర్పు రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృత ప్రచారం చేశారు. పేర్నాటిని గెలిపించాలని అభ్యర్థిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారావుయాదవ్, దామోదర్‌రాజు, షేక్ జానీబాషా, మధుసూదన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సామూహిక అక్షరాభ్యాసం


చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

**చిల్లకూరు/సైదాపురం:** వసంత పంచమిని పురస్కరించుకుని గురువారం తీర ప్రాంతంలోని చింతవరంలో, సామూహిక అక్షరభ్యాస కార్యక్రమాన్ని రేస్ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. సరస్వతి అమ్మవారి విగ్రహం వద్ద వేదపండింతులు హోమాలను నిర్వహించారు. దాతలు సుభాషిణి, రాఘవ, హరి, మస్తాన్‌నాయుడు సహకారంతో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

### యుగపురుషుడు అంబేడ్కర్


పెళ్లకూరులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

**పెళ్లకూరు:** తన మేధోశక్తితో ప్రజాస్వామ్య భారతావనికి రాజ్యాంగాన్ని రూపొందించిన డాక్టర్ భీంరావు అంబేడ్కర్ యుగ పురుషుడని తహసీల్దార్ జయజయరావు అన్నారు. మండలకేంద్రం పెళ్లకూరులో చాగణం లలితమ్మ–భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్, వైఎస్సార్‌సీపీ నేతలు బైనా చంద్రశేఖర్‌రెడ్డి, బైనా మల్లికార్జున్‌రెడ్డి దాతల సాయంతో స్థానిక దళిత నాయకులు కలిసి ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, హెచ్‌ఎంలు శంకరయ్య, వెంకటేశ్వర్లు, నాయకులు బైనా చంద్రశేఖర్‌రెడ్డి, పోలయ్య, తిరుపాలయ్య, రమణయ్య, జాకబ్, మురళి, భక్తవత్సలం, మస్తానయ్య, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధులను ఆదుకోవడం అభినందనీయం


వృద్ధులకు దుస్తులందిస్తున్న డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి

**నాయుడుపేటటౌన్:** ఎటువంటి ఆధారం లేని వృద్ధులను సేవా దృక్పథంతో ఆదుకోవడం ఎంతో అభినందనీయమని నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న మేరీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు గురువారం మల్లాం సాయిసేవా సమితి వారు 5 బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు, దుస్తులను డీఎస్పీ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన ఆశ్రమ నిర్వాహకులు సునీత, బెన్నీని డీఎస్పీతో పాటు దాతలు అభినందించారు. వృద్ధులకు తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని డీఎస్పీ వెల్లడించారు. అదేవిధంగా స్థానిక అమ్మ ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న దివ్యాంగురాలు కృష్ణవేణికి సాయి సేవాసమితి వారు వీల్ చైర్‌ను డీఎస్పీ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో మల్లాం సాయి సేవాసమితికి చెందిన దర్శి వెంకట రమణయ్య, రామ్మోహన్, వెంకట రమణా రెడ్డి, శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.